
# దీర్ఘదర్శి



**రూ.1000 కన్సొలేషన్ బహుమతి పొందిన కథ**

పదిహేనేళ్ళ కాపురంలో ఆయనమీద నాకు రోజురోజుకీ ఇష్టాన్నిపెంచిందీ, అప్పుడప్పుడు చిరాకుని తెప్పించిందీ ఒకటే. అది ఆయన ప్లానింగ్. ఆయనెంత అద్భుతంగా ప్లాన్ చేస్తారంటే- నేను దేనిగురించీ ఆలోచించక్కర్లేదు. ఆయన చెప్పినట్లు చేసేస్తే సరిపోతుంది.

చెప్పినట్లుకూడా కాదు- రాసిచ్చినట్లు. చాలా సార్లు ఆయన ఏమేంచెయ్యాలో ఎలా చెయ్యాలో రాసి ఇచ్చేస్తారు. దాంతో పనులన్నీ సవ్యంగా, సక్రమంగా అయిపోతాయి. ఏ సమయంలోనూ ఇది లేదే అన్నబాధ ఉండదు. ఇలాకాకుండా ఇంకోలా చేసుంటే బావుండేదే అని అనుకోవాల్సిన అవసరమే రాదు. ఆయనకుగల ఈ మంచి గుణంవల్లే ఇంట్లో పనులన్నీ సజావుగా సాగిపోతున్నాయి.

ఆయన ప్లాన్ చేస్తున్నపుడు అందులో ఎంత మునిగిపోతారో- ఆ ప్లాన్ గురించి చెప్తున్నప్పుడు ఎంత ఆనందపడిపోతారో చెప్పలేం. అటువంటప్పుడు ఆయన్ని చూస్తే నాకెంత ముచ్చటేస్తుందో! ముద్దు పెట్టేసుకోవాలనిపిస్తుంది. అయితే అలాంటి సందర్భంలో నేనింకేం చేసినా ఆయనకి నచ్చదు-



ఆఖరికి ముద్దుపెట్టుకున్నా కూడా.

అదే నాకు చిరాకు తెప్పిస్తుంది. ఆయనలాగా ఓ ప్లాన్‌ప్రకారం జీవితాన్ని గడపడం నాకు మొదటి నుంచీ అలవాటులేదు. నాన్న చిన్నప్పుడే పోవడంతో అమ్మే ఎన్నో కష్టాలుపడి మమ్మల్ని పెంచింది. ముందుగా ప్లాన్ చేసుకుందుకు అమ్మేం చదువుకున్నది కాదు. అంతేకాదు... అప్పుడు మా పరిస్థితుల్లో మాకు ఏరోజు గడవడం గురించి ఆ రోజు ఆలోచించడం తప్ప,రెండు మూడు రోజులక్కూడా ప్లాన్ చేసుకోవడం కుదిరేపని కాదు.

ఆయన్ని పెళ్ళిచేసుకునే వరకూ జీవితం ఇలా సాఫీగా సరళరేఖలాగా సాగిపోతుందని నాకు తెలియనే తెలియదు. ఆయనతో జీవించడం మొద

# అనామకుడు

## స్వపరిచయం



**నా** అసలు పేరు ఎస్.రామశాస్త్రి. ఐదు పదుల వయసూ- ఐదు పదుల కథలూ- మద్రాస్ విశ్వవిద్యాలయం ఐ.ఐ.టిలో, ఆక్స్‌ఫోర్డ్‌లో చదువూ, రిజర్వ్ బ్యాంక్‌లో చీఫ్ జెనరల్ మేనేజర్ ఉద్యోగం- జీవితాలను అజ్ఞాతంగా నడిపే "ఎవరో" ఇచ్చిన బహుమతులు-

పదిహేను కథలవరకూ తెలుగులో పత్రికల్ని ప్రత్యక్షంగా నడిపే "వారు" ఇచ్చిన బహుమతులు-సీతారామం అనే ఓ దంపతుల మధ్య అంకురంనుండి వానప్రస్థం వరకూ సాగిన నవగారాల రాగాల కథల సమాహారం రమణీయం. జీవితం అంటే ఏమిటి అన్న ప్రశ్నకి సమాధానం అన్వేషిస్తోంటేపుట్టిన ఇరవై ఒక్కకథల సంకలనం "శీలమా అది ఏమి?"

ఎప్పటికప్పుడు ఇంక కథలు రాయడం ఆపేద్దామని అనుకుంటూనే-మనుషుల్నీ, మనసుల్నీ, మమతల్నీ- చూసిన ప్రతిసారీ- ఏదో కొత్తదనం కనిపించడం, ఇంకొక్క కథమాత్రం రాసి ఆపెయ్యాలని అనిపించడం. నా జీవితంతోపాటే సాగుతోంది నా కథారచనా వ్యాసంగం.

e-mail : ramasastri@hotmail.com

# అనామకుడు

లెట్టాకే నాకు చీకూ చింతా లేకుండా సంతోషంగా జీవించడం అంటే ఏమిటో తెలిసింది. అయినా జీవితంలో అన్ని విషయాలూ ప్లాన్‌ప్రకారమే చెయ్యాలంటే అప్పుడప్పుడు చిరాకు వేస్తుంది.

ఈ పని ఇలా చేసేస్తే ఏం అని అనిపించి ఏదన్నా చేసేస్తే ఆయన తెగ బాధపడిపోతారు. "ఎందుకిలా చేశావు హేమా? నేను చెప్పేవాణ్ణి కదాఎలా చెయ్యాలో" అని ఏమాత్రం కోపం తెచ్చుకోకుండా చెప్పడం మొదలెడ్తారు.

దాంతో నాకు చిరాకు ఇంకా ఎక్కువైపోతుంది. ఆ చిరాకులో ఆయన ప్లానింగ్ గురించి తొందరపడి ఏదన్నా అనేస్తాను.

దాంతో ఆయన ఇంకా బాధపడిపోతారు.

"నీకు తెలియదు హేమా పనులన్నీ సరిగ్గా ప్లాన్ ప్రకారం చేసుకోక ఎంతమంది కష్టపడుతున్నారో. ఈరోజుమనం ఇలా సుఖంగా వుండగలుగుతున్నామంటే నేను చిన్నప్పట్నుంచీ జీవితాన్ని ప్లాన్ చేసుకోవడంవల్లేకదా. పరీక్షలూ, ఉద్యోగాలూ, ఇల్లూ అన్నీ సరిగ్గా జరిగిపోయాయంటే" అని చెప్పుకుపోతారు. అది నిజం అయ్యుండొచ్చు. ఐనా చెప్పొద్దూ, దాన్ని భరించడం ఒక్కోసారి నాకు చాలా కష్టం అయిపోతుంది. ఈసారీ అదే అయింది.

మా అమ్మ వచ్చే గురువారం రాత్రి హైదరాబాద్‌లో బయల్దేరి శుక్రవారం మధ్యాహ్నానికి ముంబయి వస్తోందని మా అక్కయ్య ఈ గురువారం నాకు ఫోన్‌చేసి చెప్పింది.

అదేమాట ఆయనతో అన్నాను.

"వచ్చే వారమేనా?" అని అడిగారాయన.


"ఇంకా వారం వుందిగా?" అన్నాను నేను.

"అదే మీకూ నాకూ తేడా. నాకు వారం తక్కువగా కనిపిస్తే మీకు చాలా ఎక్కువగా అనిపిస్తుంది. మీరు పనులు అన్నీ అప్పటికప్పుడు హడావిడిగా చేస్తారు. ముందుగా ఆలోచించుకునిచేస్తే చక్కగా చేసుకోవచ్చు అని అనిపిస్తుంది నాకు"

"ఇప్పుడేమైందని అంత బాధపడిపోతున్నారో నాకు అర్థంకావడంలేదు. మా అమ్మ రావడం మీకు ఇష్టం లేదులాగుంది" అని అన్నాను.

అది నిజం కాదని నాకు తెలుసు. అయినా చిరాకు వచ్చినప్పుడు మనం ఏదో ఒకటి అంటాం. ఆ మాటలకి విలువ వుండదు. కానీ అవే అవతల

ప్రేమించడంకన్నా ప్రేమించబడటం మిన్న.




వాళ్ళకి బాధో, కోపమో తెప్పిస్తాయి. కోపంలో వాళ్ళూ అలాంటిమాటే అంటారు. ఆయనకి కోపం రాదు. బాధ కలుగుతుంది. అందుకే-

"అదేంటి హేమా అలా అంటావు. మీ అమ్మగారు రావడం నాకూ సంతోషమే. నీకూ, పిల్లకీ, నాకూ అందరికీ బావుంటుంది. నేను చెప్పేది అది కానే కాదు. గురువారం స్టేషన్‌కి ఎలా వెళ్ళడం,ఎలా ఆవిడని తీసుకురావడం ఇవన్నీ చూసుకోవాలి కదా. ఆరోజు పిల్లకి పరీక్షకూడా వుంది"

"ఆరోజే ఆఖరి పరీక్ష. అందుకే ఆరోజుకి వచ్చేటట్లు పంపిస్తోంది అక్కయ్య. పిల్ల చదువుకునేందుకు మా అమ్మేం అడ్డవదు. దాని సెలవుల్లో దానికి తోడుగానూ వుంటుంది" అన్నాను నేను.

"మీ అమ్మగారు అడ్డవుతారని నేనెక్కడన్నాను హేమా? మనం ముంబయి వచ్చి నాలుగు నెల్లవుతోంది. మనకే ఇంకా ఈ ఊరు అలవాటవలేదు. మీ అమ్మగారు ఈ ఊరికి మొదటిసారి వస్తున్నారు. ఆవిడకి కష్టం కలక్కుండా అన్ని ఏర్పాట్లూ చూసుకోవాలి కదా. అందుకు టైం కావాలి కదా... నేనదీ అంటున్నది. ఈ వారంలో అన్నీ చూస్తాలే, నువ్వేం వర్రీ అవకు" అన్నారు సర్దిచెబుతూ.

ముంబయివచ్చిన తర్వాత గానీ తెలియలేదు ముంబయి ఎంత పెద్ద ఊరో. ఇక్కడ ఒకచోటు నుండి ఇంకోచోటికెళ్ళాలంటే లోకల్ రైళ్ళు ఎక్కక తప్పదు.అవి ఇంకా నాకు అలవాటు కాలేదు. ఎక్కడికెళ్ళాలన్నా ఆయనతో కలిసి వెళ్ళడమే.

పొద్దున్న పిల్లను స్కూల్లో ఆయనే దింపేస్తారు. మధ్యాహ్నం స్కూలుకి వెళ్ళి తీసుకురావడం వచ్చు నాకు. నేను వెళ్ళలేకపోతే పిల్లకి ఇంటికి రావడం రాదు. భాషా తెలియదు. ఇవన్నీ ఆలోచిస్తే ఆయన చెప్పింది నిజమేనేమో అనిపించింది.

"పోనీ మా అమ్మని ఆదివారానికి చేరుకునేలా రమ్మందామా?" అన్నాను నేను.

"నిన్నేం వర్రీ అవద్దన్నానా? అన్నీ నేను చూస్తానుగా? వచ్చే శుక్రవారం నేను సెలవుపెట్టేస్తాను. రైలు మధ్యాహ్నం ఒంటిగంటన్నరకి వస్తుంది. మీ అమ్మగారిని తీసుకుని పిల్ల స్కూలు దగ్గరకి వెళ్దాం. పిల్ల స్కూలు అయ్యేసరికి రెండున్నరవుతుంది.

● శ్రమ ద్వారానే ఆరోగ్యదాయకమైన ఆలోచనలు కలుగుతాయి.

నలుగురం కలిసి ఇంటికి వెళ్ళిపోవచ్చు.

ఒకవేళ రైలు ఆలస్యం అయిందనుకో. నిన్ను స్టేషన్‌లోవుంచి నేను స్కూలు దగ్గరకివెళ్ళి పిల్లని తీసుకుని మళ్ళీ స్టేషన్‌కి వస్తాను"

ప్లానింగ్ అయిపోయింది. రైలు ఆలస్యమైతే ఏం చెయ్యాలో కూడా చెప్పేశారు.

"ఇల్లు చిన్నదేకాని సర్దితే బాగానే సరిపోతుంది. ఒక ప్లాస్టిక్ నవారున్న స్టీలు మంచం, పరుపూ కొందాం. ఆవిడ పడుకునేందుకు వుంటుంది. అద్దైతే పగలు ఓ మూలన పెట్టెయ్యొచ్చు" అన్నారు.

అత్తగారు వస్తున్నారంటే విసుక్కోవడం లేదు సరికదా- ఆవిడకి కావాల్సినవన్నీ ఎలా అమర్చాలా అని ఆలోచిస్తున్న ఆయన్ని చూస్తోంటే- నాకెంతో ముచ్చటగా, ఆనందంగా అనిపించింది. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలబడలేదు.

మా అమ్మ వయస్సు డబ్బైఏళ్ళు. ఆవిడకి ఇంత వరకూ పెద్ద అనారోగ్యం ఏమీ లేదు. కానీ ఆ వయస్సువాళ్ళకి ఏ అనారోగ్యమైనా రావచ్చునని ఆయన దూరాలోచన.

ముంబయిలాంటి ఊళ్ళల్లో హాస్పిటళ్ళకి తీసుకు వెళ్ళడం, వైద్యం చేయించుకోవడం కష్టం అని ఆఫీస్‌లో కొలీగ్స్ దగ్గర విన్నారుట.అమ్మ ఆరోగ్యంగురించి ప్లానింగ్ మొదలెట్టారు.

ఆవిడకి వచ్చీరాగానే హెల్త్ చెకప్ చేయించాలన్నది ఆయన ప్లానింగ్‌లో మొదటి అంశం. ఆ వయస్సువాళ్ళకి ఎటువంటి ఆరోగ్య సమస్యల గురించి చెకప్ చేయించాలో ఎక్కడ చేయిస్తే మంచిదో వాకబు చేసి పెట్టుకున్నారు.

ఆయన ఆలోచించే జబ్బుల పేర్లు వింటే నాకు మతిపోయింది. బి.పి, షుగర్‌లాంటి వాటి గురించో, జ్వరం, రొంపా గురించో మాత్రమే కాదు ఆయన ఆలోచించేది.గుండెపోటు,క్యాన్సర్‌లాంటి జబ్బులు కూడా ఉన్నాయి ఆయన లిస్టులో.

"ఆరోగ్యంగా, హాయిగా మనదగ్గర ఓ పది రోజులు కాలక్షేపం చెయ్యాలని వచ్చే మనిషిని ఏదో కాటికి కాళ్ళు చాపుకున్న మనిషిని చూస్తున్నట్లు చూస్తున్నారు మీరు" అన్నాను నేను. దానికి ఆయన సమాధానం విన్న నాకు పిచ్చెక్కింది.

"అదికూడా ఆలోచించాను నేను. ఇది మనకి కొత్తప్రదేశం. మన చుట్టాలు ఎవ్వరూ లేరు. అవకూడనిదీ ఏదన్నా అయితే అప్పుడు మనమే అన్నీ చూసుకోవాలి. మీ అక్కయ్యా, బావగారూ వచ్చినా వాళ్ళకీ ఈ ఊరు తెలియదు కదా.

అందుకే స్మశానం ఎక్కడుందో-అక్కడ ఫార్మాలిటీస్ ఏమిటో, అక్కడికి తీసుకెళ్ళడానికి వాహనం ఎక్కడ దొరుకుతుందో, మన పద్ధతిలో కర్మ చేసేందుకు బ్రాహ్మడెక్కడ దొరుకుతాడో అన్నీ వివరంగా కనుక్కుని ఈ డైరీలో రాసుకున్నాను. చూడు" అంటూ తన డైరీని చూపించారు.


అమ్మకి తినడానికీ, పడుకునేందుకూ, ఊరు చూపించడానికీ ఎలా ప్లాన్ చేస్తున్నారో,ఆవిడ అనారోగ్యానికీ, పోడానికీ కూడా అలానే ప్లాన్ చేస్తున్నారు. మొదటిది నాకు నచ్చి రెండోది నచ్చకుండా పోవడం కరెక్ట్ కాదని నాకు తెలుసు. తెలిసినా కొన్ని నచ్చవు. ఇది నాకు నచ్చలేదు. ఆ మాటే అన్నాను.

"నువ్వలా అనుకోకు హేమా. నేను మా అమ్మానాన్నల విషయంలోనూ ఇదేపని చేశాను. అదేం తప్పుకాదు. మన తల్లిదండ్రులు బతికివున్నప్పుడు వాళ్ళని సరిగ్గా చూసుకోలేకపోయినా, వాళ్ళు పోయాక వాళ్ళ అపరకర్మలు సరిగ్గా చెయ్యలేకపోయినా, మన జీవితకాలం అంతా సరిగ్గా చెయ్యలేకపోయామే అని బాధపడుతూ వుంటాం. అది బావుంటుందా, అందుకే ఈ ప్లానింగ్"

"ఇంక ఈ విషయంగురించి మనం మాట్లాడుకోవద్దు" అని సంభాషణ ముగించాను. నేను అడిగినట్లుగానే నాతో ఆవిషయంగురించి మాట్లాడలేదు గానీ ప్లానింగ్ మాత్రం మానలేదు.

వారం గడిచింది. శుక్రవారం వచ్చింది. పిల్లకు చెప్పాల్సిన జాగ్రత్తలు అన్నీ చెప్పారు.

తప్పును ద్వేషించు. కానీ తప్పుచేసినవారిని కాదు.




"మేం రెండున్నరకల్లా వచ్చేస్తాం. ఒకవేళ అమ్మ అమ్మమ్మకోసం స్టేషన్‌లో వుండిపోవాల్సివచ్చినా నేను వచ్చి నిన్ను తీసుకెళ్తాను. నువ్వేం ఖంగారు పడకు. అవసరమైతే టీచర్ని అడిగి నా మొబైల్‌కి ఫోన్ చెయ్యి. మొబైల్ నెంబర్ నీ డైరీలో రాసి వుంచాను. పరీక్ష జాగ్రత్తగా రాయి" అని చెప్పి, ఆ తర్వాత పిల్లని స్కూల్లో దింపేసి వచ్చారు.

అమ్మ ఇంటికి వచ్చి రాగానే తినడానికి భోజనం, ఇంటికి రావడానికి లేటవుతుందికాబట్టి స్టేషన్‌లో దిగినవెంటనే ఆమె తినడానికి టిఫినూ, తాగడానికి మజ్జిగా తయారు చేయించారు.

ఇద్దరం స్టేషన్‌కి కాస్త ముందుగానే వెళ్ళాం.రైలు వచ్చేవరకూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపంచేశాం. రైలు ప్లాట్‌ఫామ్ మీదకి వస్తోందనగా-

"నాకేంటో గుండెలో అనీజీగా వుంది హేమా, కాస్సేపు ఈ బల్లమీద కూర్చుంటాను.నువ్వెళ్ళి మీ అమ్మని తీసుకుని ఇక్కడకి వచ్చెయ్యి. ఆవిడది ఎస్ టూ కోచ్. తొందరగా రండి. వెంటనే బయల్దేరకపోతే పిల్లని తీసుకొచ్చేటైమ్‌కి మనం స్కూలుకి వెళ్ళలేం" అంటూ అక్కడే కూచున్నారు.

నేను మా అమ్మ ఎక్కిన కోచ్ దగ్గరికెళ్ళి ఆవిడని తీసుకుని మళ్ళీ ఆయన కూర్చున్న బల్లదగ్గరకి రావడానికి పదినిమిషాలు పట్టివుంటుంది. అక్కడ కొందరు జనం నిల్చుని వున్నారు. ఏమై వుంటుందా అని అనుకుంటూ దగ్గరికెళ్ళేసరికి ఆ బల్లమీద అదోలా పడిపోయి వున్నారు ఆయన. అక్కడున్న వాళ్ళెవరో ఆయన పోయారు అని అనడం వినిపించింది. అంతే, నేను కూలబడిపోయాను. ఆ తర్వాత అంతా అమ్మే చూసుకుంది.

తనకి వచ్చీరాని భాషలో ఎవరితో ఏం మాట్లాడిందో తెలియదు గానీ, నన్ను జాగ్రత్తగా ఇంటికి చేర్చింది. పిల్లని ఇంటికి తీసుకువచ్చే ఏర్పాటు చేసింది. ఆయన శరీరాన్ని ఇంటికి తెప్పించింది, డాక్టర్ రిపోర్ట్ తయారుచేయించింది, అక్కయ్యకి ఫోన్ చేయించింది, స్మశానానికి తీసుకువెళ్ళడానికి చేయవలసిన ఏర్పాట్లన్నీ చేయించింది.

అక్కడ జరగాల్సిన పనులన్నీ చూసింది, మన ఆచారం తెలిసిన తెలుగు బ్రాహ్మణ్ణే రప్పించింది,

● గ్రహబలం, గృహబలం కన్నా ఆత్మ బలం మిన్న.

ఆ సాయంత్రానికి దహన సంస్కారం సక్రమంగా అయిపోయేట్లు అన్నీ చేసింది. ఇన్ని పనులూ నాకు ధైర్యం చెప్తూ నా దగ్గర వుంటూనే చేసింది. పిల్లకి కావల్సినవన్నీ చూస్తూనే చేసింది.

పదిహేనేళ్ళుగా కలిసివున్న ఆయన లేరు. ఒక మనిషి ప్రాణం అంత హఠాత్తుగా పోతుందని ఎప్పుడూ అనుకోలేదు నేను. అలా చూస్తూండగానే ఆయన ప్రాణం పోయింది. నాకు ఆ దుఃఖం భరించలేనిది. అసలు ఆయనలేని బతుకు ఎందుకని అనిపించింది. ఏడుస్తూ ఆ మాటే అంటూంటే, అమ్మే నన్ను ఓదార్చి ధైర్యం చెప్పింది.

"మనం మనకోసం కాదమ్మా బతికేది, మన వాళ్ళకోసం. మీ నాన్నపోతే నేను మీకోసం బతకలేదూ? నువ్వూ అంతే... నీ పిల్లకోసం బతకాలి. నాకోసం బతకాలి" అని నన్ను దగ్గరికి తీసుకొని ఊరడించింది. అలా ఊరడిస్తూనే-

ఆయన కొలీగ్స్‌తో మాట్లాడి ఆయనకి రావాల్సిన ప్రోవిడెంట్‌ఫండ్ డబ్బుని తెప్పించింది. ఇన్సూరెన్స్ పేపర్లు పంపించింది, ఆయన ఆఫీస్‌లో నాకు ఉద్యోగంకోసం అప్లై చేయించింది. నెమ్మదిగా ఆయన పోయిన బాధనుండి నేను కోలుకునేలా చేసింది. ఆ నెలరోజులూ అమ్మ చేస్తున్న పనులు చూస్తుంటే నాకు ఆశ్చర్యం వేసింది.

అన్నీ ప్లాన్‌చేసే ఆయన లేరు. అసలు ప్లానింగ్ చేతకాదనుకున్న అమ్మ... ఊరుకాని ఊళ్ళో, భాష సరిగ్గారాని చోట... ఆయన్ని సగౌరవంగా సాగనంపింది. ఆ తర్వాత నాకూ, నా పిల్లకూ రావల్సినవన్నీ వచ్చేట్లు చూసింది. ఏర్పాట్లన్నీ చేసింది.

అమ్మని పట్టుకుని ఏడుస్తూ నేను ఆయన ప్లానింగ్ గురించి చెప్పాను. అమ్మ నవ్వేసింది. నవ్వి-"నేను ఉండి అతను పోవడం మన దురదృష్టం. మనం అందరం ఇక్కడనుండి వెళ్ళిపోయే క్యూలో ఉన్నవాళ్ళమే. అయితే క్యూలో ఎవరం ముందున్నామో మనకి తెలియదు. ముందొచ్చిన వాళ్ళు ముందుంటారని అనుకుంటాం. అల్లుడూ అలానే అనుకున్నాడు. అలా అయ్యుంటే మనందరికీ బావుండేది. ఏంచేస్తాం... మన ప్రాప్తం"

"నా పదిహేనేళ్ళ కాపురంలో అన్నీ ఆయన ప్లాన్ చేసినట్లే జరిగాయి..." ఇంకేమనాలో తెలియక ఆగిపోయాను. అమ్మ చిన్నగా నవ్వింది.

"వెర్రిపిల్లా- నువ్వు అనుకుంటున్నావు అన్నీ అల్లుడి ప్లాన్ ప్రకారం జరిగాయని. అసలు సంగతేంటంటే... అల్లుడి ప్లాన్... అసలు పెద్ద ప్లానర్ ఉన్నాడే వాడు... అంటూ తన చూపుడువేలుతో పైకి చూపించి, వాడి ప్లాన్‌తో సరిపోయింది.అందుకే అన్నీ అలా జరిగాయి. వాడి ప్లాన్ ప్రకారమే అంతా నడుస్తుంది. మనం నిమిత్తమాత్రులం.

అయితే మనం ఇలా చెయ్యాలీ, అలా చెయ్యాలీ అని అనుకోవడం ఎందుకు... చెయ్యడం ఎందుకు? దానివల్ల ప్రయోజనం ఏముంది? ప్రయోజనం వున్నా లేకపోయినా... బతికి ఉన్నంత కాలం ఏదో ఒక పనిచేస్తూ వుండాలి కదా.ఆ పనేదో మనకీ మన చుట్టూ వున్నవాళ్ళకి ఉపయోగపడేదిగా వుంటే మంచిది కదా. అలా చేస్తూనే వుండాలి.

జీవితం అంటే- కొంత మన ప్లాన్, కొంత మనకి తెలియని వాడెవడో వున్నాడే వాడి ప్లాన్.అవి కలుస్తాయో లేదో తెలియదు. ఆ తెలియని తనమే, ఆ అనిశ్చితే జీవితానికి ఒక అర్థాన్ని కలిపిస్తుంది, జీవించడంమీద ఆశని కలిగిస్తుంది.

అలాకాక ఏం జరిగిపోతుందో ముందే తెలిసిపోయినా ఏం జరుగుతుందో అస్సలు తెలియకపోయినా... జీవితమంటే విరక్తో, భయమో కలుగుతాయి. రెండూ మనకి మంచివి కావు. ఆ మాత్రం ఆలోచించకుండా ఇంత విశ్వాన్ని ప్లాన్ చేశాడనుకుంటున్నావా? వాడేం ముందుచూపు లేనివాడు కాదు. చాలా ముందుచూపు వున్నవాడు..."

అమ్మ ఇలా మాట్లాడ్డం నేను ఇంతకు ముందు వినలేదు. అసలావిడకు ఇటువంటి విషయాల గురించి అవగాహన వుంటుందని అనుకో లేదు నేను. అమ్మంటే వంటా,వడ్డింపూ, కుట్లూ, పూజలూ ఇవే అనుకున్నాను. అలాంటి అమ్మ విశ్వం గురించి ఇంతగా విశ్లేషించి, విశదీకరించి చెప్తోంటే వింటూ కూచుండిపోయాను. ◇◇